

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఏవిటా వెల్ కమ్ ఒబామా?

**నేను కాస్త తీరుబడిగా ఉన్నప్పుడు** మా అమ్మతో వాదన వేసుకుంటాను. అది నా హాబీ. మా సంభాషణ ఇలా ఉంటుంది.

"ఇంగువ అయిపోయింది. బయటకి వెళ్ళినప్పుడు తీసుకురా!"

"ఎందుకయిపోయింది? మొన్నేగా తెచ్చాను.. నాకైతే ఆరునెలలొస్తుంది. నువ్వు నీళ్ళల్లో కలుపుకు తాగేసావా?"

"ఇలా అంటేనే నాకు చిర్రెత్తుకొస్తుంది. నా వంటలో నీ వంటలో తేడా లేదూ?"

"ఎందుకు లేదూ? నువ్వొచ్చినప్పటినుండీ కడుపు నిండా తిండి తినలేదు."

"నువ్విలా అంటే పెద్దమ్మ ఇంటికెళ్ళిపోతాను."

"ఆవిడకి పాపం ఎసిడిటీ అల్సర్. నీ కారాలకీ, పులుపులకీ ఏమైపోతుందో పాపం?"

"నా వంట అందరూ పొగుడ్తారని నీకు కుళ్ళు కావాలంటే మీ ఆయన్ని అడుగు"

"ఆయన జహీరాబాద్‌లో అబ్దుల్ పాషా వంట తిని వస్తాడు. నువ్వేం పెట్టినా ఆయనకి అపురూపమే!"

"బయటకి వెళ్ళినప్పుడు ఇంగువతో పాటు నవ్వులు కూడా తీసుకురా. అయిపోయాయి."

"ఏవైనా అయిపోతే అవి లేకుండానే చెయ్యాలని మా అమ్మమ్మ చెప్పింది."

"తీసుకు రావచ్చుగా!"

"అవి లేకుండా కూడా నేను రుచిగా కూర చెయ్యగలను."

"నీకు నేను ఉంటే తెలీడం లేదు నా విలువ."

"తెలుస్తూనే ఉంది. మిరపకాయల డబ్బా చెప్తోంది."

"అసలు నా వంటకి వంక పెట్టేది నువ్వు ఒకత్తివే."

"మందులు మింగుతున్నది మరి నేనేకదా!"

ఇంతలో మా పెద్దాడు నిద్రలేస్తాడు. "అబ్బబ్బా! మీరిద్దరూ మళ్ళీ మొదలు పెట్టారా? అమ్మా నువ్వు ఏవైనా రాసుకోవచ్చుకదా!" అన్నాడు అశ్విన్.

"ఏవిట్రా రాసుకునేది? మీ అమ్మమ్మ ఆపకుండా మిక్సీ శబ్దం, కుక్కర్ మోత నా చెవిలో పెడ్తుంటే. తెల్లవారు ఝాము నుండీ రాత్రి వరకూ వంట ఆపకుండా చేస్తోంది."

"ఎందుకూ?" వాడు విసుగ్గా మొహం పెట్టాడు.

"నేను ఓట్స్ తిని ఆఫీస్ కెళ్తాను. నువ్వు బయట స్టూడియోలో తింటావు. నాన్న రారు. కృష్ణ ఫ్రెండ్స్‌తోనే బయట తింటున్నాడు. ఎవరి కోసం వంట?"

"బహుశా వరలక్ష్మి కోసమేమో!" అన్నాను. వరలక్ష్మి మా పనిమనిషి.

మా అమ్మకి ఒళ్ళు మండిపోయింది.

"రేపటి నుండి వండనురా. గడ్డి తినండి. నేను వెళ్ళిపోతే మీ అమ్మ కొనుక్కొచ్చి ఆ ఓట్స్ అనీ, నూడిల్స్ అనీ మీకు అవే పెడ్తుంది. ఏదో ఉన్నాను కదా పెద్దదాన్ని అని వంకాయ కాల్చి పులుసు పచ్చడి చేసాను. కృష్ణకి ఇష్టం అని చామదుంపల వేపుడు రాత్రికి మీ నాన్న వస్తాడేమో శనివారం అని మజ్జిగ పులుసు చేసి అందులోకి పెసర పుణుకులు చేస్తున్నాను. మజ్జిగ పులుసుకి కాంబినేషన్ మామిడికాయ పప్పు చేసాను. ఆ కరివేపాకు సుశీల గారి ఇంట్లోనుండి కోసుకొచ్చి నాలుగు రోజులైంది. ఎండిపోతుందని కరివేపాకు కారం నూరాను. ఇన్నున్నా నువ్వు రాత్రి పుల్కాలలోకి కూర లేకపోతే తినవుగా. అందుకే క్యాబేజీ, టమాటా చేద్దాం అనుకుంటున్నాను. దీనికే మీ అమ్మ ఇన్ని మాటలంటోంది." అని బాధపడింది.

అశ్విన్ కాస్త మెత్తబడి "ఐటెమ్స్ ఆర్ ఇంట్రెస్టింగ్. అమ్మమ్మా ప్రొసీడ్ నువ్వు అమ్మ మాటలేం పట్టించుకోకు" అని జడ్జిమెంట్ ఇచ్చేస్తాడు.

ఇంతలో మా కృష్ణ ఫోన్ చేసాడు.

"మమ్మీ నేను లంచ్‌కి రాను" అని.

"అదేవిట్రా? మీ అమ్మమ్మ నీ కోసం చామదుంపల వేపుడు చేసింది" అన్నను.

"అందుకే రాను. అమ్మమ్మాస్ కుకింగ్ ఈజ్ డెలీషియస్. దాంతో నా వెయిట్ లాస్ ప్రోగ్రామ్ దెబ్బ తింటోంది. వస్తే అది తినూ, ఇది తినూ అని చంపేస్తుంది. నేను ఇక్కడ సుశాంత్ గాడి రూములో వాడు చేసే భయంకరమైన వంట తింటా. బై." అన్నాడు.

"కృష్ణ భోజనానికి రాడుట." అని నేను మా అమ్మతో చెపుదాం అని చూసేసరికి ఆవిడ ఇంగువ డబ్బా కత్తితో కిరాతకంగా చీల్చి మిగిలిన పొడంతా వేసి మజ్జిగ పులుసులో ఘుమఘుమలాడే పోపు పెడ్తోంది.

నేనూ కాసేపుంటే టెంప్ట్ అయి నేను తినకూడనివన్నీ తినేస్తానేమోనని, వరలక్ష్మితో "నేను ఆఫీస్‌క్ వెళ్తా. నా బ్రౌన్ బ్రెడ్, మజ్జిగ సీసా కార్లో పెట్టు. నువ్వు హాయిగా తినేసెయ్" అని చెప్పి బయల్దేరాను.

తీరా చెప్పులు వేసుకునే టైంకి ఫోన్ వచ్చింది. అన్‌నోన్ నెంబర్, తియ్యాలా వద్దా అని సంశయించి, పోన్లే తీద్దాం అని తీసాను.

"అమ్మా నమస్కారం. నేను శ్రీనివాసరావుని మాట్లాడ్తున్నా" అని ఓ పెద్దాయన కంఠం వినిపించింది.

"ఏ శ్రీనివాసరావండీ?" అన్నాను. ఆంధ్రదేశంలో ఈ పేరుతో డెబ్బై పర్సెంట్ మంది ఉంటారు.

"నేను సింగీతం శ్రీనివాసరావునమ్మా. పిక్చర్స్ డైరెక్ట్ చేస్తాను."

నేను నాలిక కరుచుకుని "సార్ నమస్కారం, మీరా? మీరేనా?" అని, ఇంకేం అనాలో తోచక ఆపేసాను.

"అమ్మా ఏం లేదు. నేను వెలకమ్ ఒబామా అని ఓ సినిమా తీస్తున్నాను."

"చాలా సంతోషం అండీ" అన్నాను. బహుశా ఏ స్క్రిప్ట్ వర్క్ కోసమో ఫోన్ చేసి ఉంటారు అనుకున్నాను.

"నిన్న యూ ట్యూబ్‌లో మీ ఇంటర్వ్యూ ఒకటి చూసి, ఒక కారెక్టర్‌కి మీరైతేనే సూట్ అవుతారనిపించి ఫోన్ చేస్తున్నాను. అమ్మా... సింపుల్ అమ్మా... ఓ నాలుగైదు రోజులు వర్క్ ఉంటుంది" అన్నారు.

"కారెక్టరా" నేను షాక్ తిన్నాను.

వెంటనే "నేను ఏక్ట్ చెయ్యనండీ. ఇంతవరకూ చెయ్యలేదు కూడా!" అన్నాను.

"అదేనమ్మా నాకు కావలసిందీ. ఇంత వరకూ ఎక్కడా చేసి ఉండకూడదు. టీ.వీ.లోకూడా. ఫ్రెష్ ఫేసెస్ కావాలి. మీ ట్రాక్‌లో అందరూ రైటర్సే. మీరూ, భువనచంద్రా, అనంత శ్రీరామ్" అన్నారు.

"అదికాదండీ.."

"నాకు ఎనభై సంవత్సరాలు. ఎంతమంది కొత్తవాళ్ళ చేతో నటింప చేసా. నా మాట కాదనక ఒప్పేసుకోమ్మా" అన్నారు.

"ఓసారి మా వార్నీ, పిల్లల్నీ అడిగి చెప్తానండీ" అన్నాను.

"అలాగేనమ్మా. కానీ మంచి కారెక్టర్. ఆవిడ పేరు అనురాధ. అమ్నీషియా వచ్చి రెండేళ్ళ నుండీ జరిగిన సంగతులన్నీ మరిచిపోతుంది. పెళ్ళైన కూతురికి మేనల్లుడితో రోజూ నిశ్చితార్థం జరిపిస్తూ ఉంటుంది. మళ్ళీ ప్రొద్దుట లేచి మళ్ళీ నిన్న జరిగింది మర్చిపోయి నిశ్చితార్థం అంటుంది" ఆయన ధారగా చెప్పేస్తూనే ఉన్నారు.

నేను ఆలోచనలో పడ్డాను.

అసలు ఈ 'గజని' టైప్ కారెక్టర్ నా ఇంటర్వ్యూ చూసి నాకు ఇవ్వాలనిపించడం ఏవిటీ? ఆ ఇంటర్వ్యూలో నేనేం మాట్లాడి ఉంటానూ? అని.

ఆ రోజు రాత్రి భయం భయంగా మా పిల్లలతో విషయం చెప్పాను.

"నో!" అని అరిచాడు అశ్విన్.

"నీ ఇష్టం" అన్నాడు కృష్ణ.

"తప్పకుండా చెయ్యి. షూటింగ్ ఎప్పటినుండీ?" అంది మా అమ్మ.

అశ్విన్‌తో నేను "సింగీతం శ్రీనివాసరావుగారంటే, పుష్పక్, ఆదిత్యా 369, మైకేల్ మదన కామరాజూ, మయూరీ, సొమ్మొకడిదీ సోకొకడిది" అని కన్విన్స్ చెయ్యడానికి ట్రైచేసాను.

"నో!" అన్నాడు స్థిరంగా.

మా ఆయన నుండి ఫోన్ వచ్చింది. "ఏవండీ.. ఇదీ సమస్య.. మీరేం అంటారు?" అడిగాను.

"నలభై దాటాకా అయినా డెసిషన్స్ సొంతంగా తీసుకోవాలి. దాన్నే మెచ్యూరిటీ అంటారు" అన్నారు సీరియస్‌గా.

"కానీ పిల్లలు.." అని నసిగాను.

"వాళ్ళు అన్నీ మనని అడిగి చేస్తారా? చెప్పినట్లు వింటారటా?" సూటిగా లాయర్లా అడిగారు.

దాంతో నాకు ధైర్యం వచ్చింది.

"అశ్విన్ నాన్న ఇలా అంటున్నారు" అని మొత్తం చెప్పేసాను.

అటు కొడుకూ, ఇటు న్యాయం అన్న సీన్‌లో మధ్యలో కళ్ళకు గంతలు కట్టుకున్న న్యాయదేవత త్రాసు పట్టుకున్న బొమ్మ ఉన్నప్పుడు ఎన్.టి.ఆర్‌లా ఫీల్ అయ్యాడు అశ్విన్.

ఇప్పుడు మా ఇష్టమే అంటే రేపు వాడి ఇష్టాలకి మేం అడ్డువస్తామేమో అన్నంత ముందు ఆలోచన చేసాడు.

"సరే కానీ ఈ ఒక్క సినిమానే" అన్నాడు.

"ఏమో? ఎవరం ఏం చెప్పగలం?" అంది కూర తరిగేస్తూ మా అమ్మ.

మొత్తానికి కుటుంబ సభ్యులందరి ఆమోదం దొరికింది.

నేను ప్రొడ్యూసర్ భారతీ కృష్ణగారి మిసెస్. భారతి ఫోన్ చేస్తే ఈ శుభవార్త చెప్పాను. ఆవిడ కూడా ఆనందపడింది.

"24 నుండి 28 వరకూ ఖాళీపెట్టుకోండి మేడం" అంది.



23 వతారీఖు సాయంత్రం సింగీతంగారు చెన్నై నుండి వచ్చారు. ఆయన ఆర్టిస్టులందర్నీ సమావేశపరిచి కథ చెప్తానన్నారు.

నేను సాయంత్రం ఐదు గంటలకల్లా ఆయన బస చేసిన 'కెన్స్' హోటల్‌కి వెళ్ళాను. భారతిగారూ, భారతీ కృష్ణగారూ, 'మా' టీ.వీలో నా కొలీగ్ విక్టర్ అక్కడ ఉన్నారు. నన్ను సాదరంగా ఆహ్వానించి ఆయన గదికి తీసుకెళ్ళారు.

భువన చంద్రగారూ, రేడియో జాకీ శేఖర్, ఊర్మిళ అనే మరాఠీ హీరోయిన్, సింగీతంగారి కో డైరెక్టర్ పూర్ణ ప్రజ్ఞగారూ అంతా సమావేశం అయ్యాం. భువనచంద్రగారితో వంగూరి ఫౌండేషన్ వారి సభలకి మేం ఇద్దరం కలిసి అమెరికా వెళ్ళాల్సింది. నేనే లాస్ట్ మినిట్‌లో కాన్సిల్ చేసుకున్నాను. ఆ విషయం ప్రస్తావించి "పోన్లెండి ఇలా అయినా కలుసుకున్నాం" అని భువనచంద్రగారు ఆనందపడ్డారు.

అనంత శ్రీరామ్ అలవాటుగా ఆలశ్యంగా వచ్చాడు.

అతను రామానాయుడుగారు తీస్తున్న నా లేటెస్ట్ చిత్రం "నేనేం చిన్నపిల్లనా?"కి రెండు పాటలు రాసాడు. అప్పుడూ లేట్‌గానే వచ్చాడు. దానికి అతని జవాబు.

"రాయడంలో ఆలశ్యం ఉండదు. రావడంలోనే" అని.

అతను పంచ్ డైలాగ్‌ల కింగ్. మాట మాటకీ మనని నవ్వించగలడు. చిన్న వయసులో అద్భుత ప్రతిభగల కుర్రాడు.

మేం కాఫీలు తాగి కాసేపు సింగీతంగారి జోకులతో ఎంజాయ్ చేస్తుండగా అనంత శ్రీరాం కూడా వచ్చాడు. సింగీతంగారి కబుర్లు వింటూ, మీకు ముప్పై ఐదేళ్ళు నిండాయా అండీ?" అని అనంత శ్రీరాం ఆయన్ని సీరియస్‌గా అడిగాడు.

ఆయనా అంతే సీరియస్‌గా "ఎందుకు పది ఎక్కువ చెపుతున్నారూ? నేనలా కనిపిస్తున్నానా?" అని అడిగారు.

సింగీతంగారి భార్య కళ్యాణిగారు కూడా మాతో కూర్చుని సరదాగా మాట్లాడారు.

తరువాత సింగీతంగారు మాకు కథ చెప్పి, పాత్రల స్వభావాలూ, మేనరిజమ్స్ ఎక్స్‌ప్లైన్ చేసారు.


సింగీతంగారు, పూర్ణప్రజ్ఞగారు, రోహిణి, అనంత శ్రీరాంలతో

"రేపటినుండీ షూటింగ్. రోహిణి కూడా వచ్చేస్తుంది. ఆమే ఈ స్క్రిప్ట్ రాసింది. నాకు అసిస్టెంట్‌గా ఈ సినిమాకి పనిచేస్తోంది" అని చెప్పారు.

రోహిణి నటించిన 'స్త్రీ' సినిమా నాకు ఇష్టం. అది పాలగుమ్మి పద్మరాజుగారి పడవప్రయాణం. పాలగుమ్మి సీత నాకు ఫ్రెండ్ సీత నాకు వాళ్ళ నాన్నగారి పుస్తకాలన్నీ ఇచ్చింది.

రోహిణికి జాతీయ అవార్డు కూడా వచ్చినట్లుంది.

"మీరు రచయితలు. డైలాగ్స్ విషయంలో స్వేచ్ఛ తీసుకోండి. ఇంప్రొవైజ్ చేసి చెప్పుకోండి" అన్నారు.

ఇకనేం మాకు పూర్తి ఎనర్జీ వచ్చేసింది.

మా అమ్మ రాత్రే నాకు పెట్టె సర్దేసింది (నా ఓన్ కాస్ట్యూమ్స్ మరి.)

మర్నాడు ప్రొద్దుటే ఆరుగంటలకల్లా భారతీ కృష్ణగారి ఫ్లాట్స్‌లో షూటింగ్.

"త్వరగా వెళ్ళాలి. మేకప్ వేసుకోవాలిగా" అని అమ్మ తొందర పెట్టింది. ఆర్టిస్ట్ తల్లిగా ఆవిడకి మహా సంబరంగా ఉంది. ఇలా సంబరపడ్డ వాళ్ళల్లో ఇంకొకరు మా డ్రైవర్ నర్సింగ్. చాలా ఉత్సాహంగా ఉన్నాడు.



నేనే మొదటిసారి కెమేరాని ఫేస్ చెయ్యాలని బెరుకుగా, ఎందుకు ఒప్పుకున్నానురా బాబూ అని వెళ్ళాను. పైగా పెద్ద డైరెక్టర్ సరిగ్గా చెయ్యకపోతే ఏవంటారో అని భయం. ఇన్నాళ్ళూ షూటింగ్‌కి వెళితే కాలుమీద కాలేసుకుని, కొబ్బరినీళ్ళో, కాఫీనో తాగుతూ మానిటర్ పక్కన డైరెక్టర్ గారి చైర్ పక్కనేనో, ప్రొడ్యూసర్ గారితో కబుర్లు చెప్తూనో మహారాణిలా కూర్చోవడం అలవాటు.

మేకప్ వేసుకోవాలేమో అనుకుంటుంటే డైరెక్టర్ గారు "నో మేకప్ అమ్మా. ఫస్ట్‌క్లాస్‌గా ఉన్నావు. నేచురల్ బ్యూటీ కావాలి నాకు" అన్నారు.

అమ్మయ్యా అనుకున్నాను. మంచి సమ్మర్. చెమటలు కారిపోతున్నాయి.

భువనచంద్రగారు పోలీస్ ఆఫీసర్ కాస్ట్యూమ్స్‌లో ఉన్నారు. అనంత శ్రీరాం మంచి సూట్‌లో ఉన్నాడు.

నేను కాటన్ శారీ కట్టుకుని ఉన్నాను.

ఫస్ట్ షాట్ పెట్టారు.

డైలాగ్ చెప్పింది రోహిణి.

ఈస్త్‌బెన్ అని ఫ్రెంచ్ పిల్లాడూ, నేనూ, అనంత శ్రీరాం ఉన్నాం ఆ షాట్‌లో.

"ఏక్షన్, కెమేరా రోల్.. క్లాప్" ఇవన్నీ నాకు కొత్త కాదు. నేను కెమేరా ముందు ఉండడం మాత్రమే కొత్త.


ఈస్త్‌బెన్‌తో అమ్మా నేను

నేను నవ్వుతూ డైలాగ్ చెప్పాను.

"కట్. ఓకే" అన్నారు డైరెక్టర్ గారు.

మళ్ళీ ఎన్నిసార్లు చెయ్యాలో అనుకున్నాను.

"రామ్మా! మానిటర్‌లో చూసుకో. అంతా బాగుంది. ఓకే" అన్నారు సింగీతంగారు.

నేను ఆశ్చర్యంగా వెళ్ళి చూసాను. ఎంతో ఆనందంగా అనిపించింది.



ఆ రోజు ఆరు సీన్స్ చేసాం. రాత్రి నిశ్చితార్థం సీన్. మూడుసార్లు పట్టు చీరలు మార్చాల్సొచ్చినప్పుడు మాత్రం ఆ వేడిలో చెమటతో విసుగనిపించింది. కానీ మానిటర్లో మేం చేసిన సీన్ డైరెక్టర్ చూపించి మెచ్చుకుంటుంటే, ఆ అలసట అంతా మర్చిపోయి సంతోషంగా అనిపించింది.

అమ్మకి భారతిగారి మదర్‌తో, సింగీతంగారి భార్య కళ్యాణిగారితో అసలు టైమే తెలీలేదు. మొత్తం ఆ రోజు ఆరు కాస్ట్యూమ్స్ మార్చాను. ఆవిడకి నా చీరలు మడత పెట్టి సర్దడం, నాకు మజ్జిగ, కమలాపండు ఒలిచిపెట్టడంలాంటి పనులు తప్ప పెద్దగా పనిలేదు. గంటకోసారి కొబ్బరి నీళ్ళో, మజ్జిగో, కాఫీనో, మధ్యమధ్యలో స్నాక్స్, మధ్యాహ్నం భోజనల దగ్గర భువనచంద్రగారి పాటలూ, అనంత శ్రీరాం జోక్‌లతో సరదాగా గడిచింది.

అనంత శ్రీరాం తన డైలాగ్స్ తనే రాసుకున్నాడు. అతను నన్ను క్యూర్ చెయ్యడానికొచ్చిన సైక్రియాటిస్ట్ అనుకుంటాం సినిమాలో. కానీ కాదు. అతనే పిచ్చాసుపత్రి నుండి తప్పించుకొచ్చిన పేషెంట్.

నేను ఉన్నదాన్ని నా మతిమరుపుకి అన్వయించుకుని ఇంప్రొవైజ్ చేసి డైలాగ్స్ చెప్పుకున్నాను.

భువనచంద్రగారికి ఏ డైలాగ్ ఇచ్చినా, బట్టీ పట్టించినా, షాట్‌లో అది చెప్పరు. తను అప్పుడు నోటికొచ్చినదే చెప్తారు. ఆయన మెమరీ పాడ్‌లో మొత్తం వేలవేల పాటలు ఎక్కించేసుకున్నారు. అందువల్ల ఆయన రాసిన పాట లిరిక్ కూడా జ్ఞాపకం ఉండదు. హిందీ ఓల్డ్ సాంగ్స్, మలయాళం పాటో పాడుత్తూ ఉంటారు. మనకి అర్థాలు కూడా చెప్తారు.



పదహారు భాషల్లో ఆయనకి పాండిత్యం ఉంది. ఎనిమిది భాషల్లో పాట పాడతారు. మంచి గాత్రం.

"నిన్నా కుట్టేసినాది మొన్న కుట్టేసినాది గండు చీమా"

"బంగారు కోడిపెట్ట... వచ్చెనమ్మా"లాంటి అల్లరి పాటలు రాస్తునే "పచ్చని చిలకలు తోడుంటే పాడే కోయిల వెంటుంటే.." అంటూ మెలొడీస్ కూడా రాసేయగలరు. బాగా మాస్ కవి. "కిళ్ళీమింజారో.. కథాకళీ మాంజారో" లాంటి అన్యభాషా ప్రయోగాలూ, ప్రదేశాల పేర్లూ అవీ పాటలో అవలీలగా పెట్టి ఐశ్వర్యారాయ్ చేతా, రజనీకాంత్ చేతా స్టెప్పులేయించగలరు.

ఆ రోజు రాత్రి ఇంటికి వెళ్ళేసరికి ఒకటింపావు అయింది.

మర్నాడు ఎనిమిది ఇంటికల్లా నాదే ఫస్ట్ షాట్.

మళ్ళీ అమ్మ పెట్టెలో నాకు చీరలు చూపించి సర్దేసింది. ఎందుకైన మంచిదని కంటిన్యుటీ చీరలు అక్కడే ఉంచేసి వచ్చేసాను.

సీన్ చేసి అనంత శ్రీరాం డైలాగ్‌కి పడీ పడీ నవ్వేవాళ్ళం. చేస్తున్నంత సేపూ సీరియస్‌గా హావభావాలు పెట్టడం నాకూ, భువనచంద్రగారికీ కష్టమయ్యేది.

సీన్ అవగానే సింగీతంగారే పెద్దగా నవ్వేవారు. ఆయనలో నేను ఒక యువకుడినే కాదు, పసిపిల్లాడ్ని కూడా చూసాను. ఎంత ఆనందమో సీన్ బాగా వస్తే.



అప్పటిదాకా ప్లెయిన్‌గా ఉన్న సీన్‌ని, ఒక చిన్న కన్ఫ్యూజన్‌తో హాస్యంగా మార్చేయగలరు ఆయన. ఆయన డైరెక్షన్ చేస్తుంటే, "అబ్బా! డైరెక్షన్ అంటే ఇంతేనా?" అనిపిస్తుంది మనకి.

"అమ్మా. నేనేం చెయ్యను.. అంతా మీ కృషే. ఊరికే సలహా, క్రెడిట్ తనం నాది" అనేవారు.

నేను ఆత్రుతగా మానిటర్ దగ్గర కొచ్చి చూసాక సీన్ "బాగా తీసానా తల్లీ ఫర్వాలేదా?" అనేవారు. నేను సిగ్గుపడి "అదేంటండీ.. అలా అంటారు?" అనేదాన్ని.

"ఎంత హాయిగా ఫ్రెష్‌గా ఉందమ్మా మీరు ఏక్ట్ చేస్తుంటే. అసలు ఏక్టింగ్‌లా లేదు. నేచురల్‌గా ఉంది. యూ ఆర్ ఏ గుడ్ ఏక్ట్రెస్" అని నన్ను ఎంకరేజ్ చేస్తుండేవారు.

నటుల చేత కొట్టేసీ, కొరికేసీ, గిచ్చేసీ చేయించే డైరెక్టర్లని కూడా నేను సెట్లో ఉండి చూసినదాన్ని. సింగీతంగారు కులాసాగా నవ్విస్తూ, నవ్వుతూ మా చేత మొదటిసారి నటింప చెయ్యడం చూస్తుంటే, ఓ అద్భుతంలా అనిపించింది.

రోహిణి ఒక్కత్తే, నలుగురు అసిస్టెంట్ డైరెక్టర్ల పెట్టు. మాకు డైలాగ్ చెప్పి, కంటిన్యుటీలు చూసుకుని డైరెక్టర్ గారి ఇన్‌స్ట్రక్షన్స్ ఫాలో అవుతూ ఫీల్డ్ క్లియర్ చేస్తూ బండి చక్రంలా తిరుగుతుండేది.

సారథీ స్టూడియోస్‌లో పోలీస్ స్టేషన్ సెట్టూ, కోర్టు ఎక్స్‌టీరియర్ షాట్స్ తీసారు. అవన్నీ నాకు సీరియస్ సీన్లు. ఇంగ్లాండ్ నుండొచ్చిన రేచల్, ఊర్మిళ, ఎస్తెబెన్, భువనచంద్రగార్లతో కాంబినేషన్స్.


రేచల్‌తో అమ్మా, నేను

గొప్ప ఉత్సాహంతో, పలుకుబడిలో ఒక్క సీన్లో నటించడానికొచ్చే కొంతమంది, ఒక్క డైలాగ్ అప్పచెప్పడానికీ, కెమేరా వైపు చూడకుండా నటించడానికీ ఎంత టైం తీసుకుంటారో, ఎంత అవస్తపడతారో, ఎంత భయపడతారో చూసాక నాకు అర్ధమయింది.

మా ఇన్నాళ్ళ, ఇన్నేళ్ళ సినిమా ఇండస్ట్రీ అనుభవం నటనకి ఎంత పనికి వచ్చిందో? కొన్ని వందల మంది ఆర్టిస్ట్‌లకి డిక్షన్ నేర్పించి ఉంటా, ఎన్నో పాత్రలని మనసులో ఏక్ట్ చేస్తూ రాసి ఉంటా. ఆ అనుభవం అంతా ఈ రోజు నటించడానికి ఉపయోగపడింది. ప్రత్యేకంగా నేర్చుకోవాల్సిన పని లేకుండా పోయింది. అందుకే రైటర్సే కావాలనుకున్నారు ఈ ట్రాక్‌కి సింగీతంగారు.

నిన్న ఒక్క రోజులోనే నా మొత్తం డబ్బింగ్ అంతా పూర్తిచేసా. రేపటి నుండి నేను ఊళ్ళో ఉండనని.

”అమ్మా! నాకు నీ వాయిస్సే కావాలి. మెలోడియస్ టోన్. వీణ తీగ మీటినట్లు ఉంటుంది.” అన్న ఆ మహా డైరెక్టర్ కాంప్లిమెంట్స్ నేను ఎన్నటికీ మర్చిపోలేను.

”మిమ్మల్ని మీ అమ్మాయి నటనతో తినేస్తోంది. సైలెంట్ కిల్లర్” అని అమ్మతో భువనచంద్ర గారు అన్నారు.

నిన్న డబ్బింగ్ లో కూడా ఆయన అదేమాట.

బాలూగారి అక్షరాంజలి HMTV వారి ప్రోగ్రాంలో అనంత శ్రీరాం స్టేజ్ మీద నా పక్కన కూర్చుని ”మన ట్రాక్ చాలా బాగా వచ్చింది. మీరు చాలా బాగా చేసారు” అని బడి పిల్లాడు క్లాసులో ఫస్ట్ మార్కులొచ్చినంత సంబరంగా నా చెవిలో చెప్పాడు.

ఈ సినిమా కమర్షియల్ సినిమాల కోవలోకి రాదు. ఆర్ట్ ఫిల్మ్‌కూడా కాదు. కానీ ఒక సమస్య చుట్టూ తిరిగే సీరియస్ కథాంశంతో తీసిన ప్రయోజనాత్మక చిత్రం.

ఈ సినిమా గురించి చెప్పినప్పుడు కొంతమంది గురించి చెప్పుకోవాలి.

మమ్మల్ని ఆప్యాయంగా పలకరిస్తూ, షూటింగ్ అప్పుడు అమ్మకి మంచి కంపెనీ ఇచ్చిన సింగీతంగారి మిసెస్ శ్రీ కళ్యాణిగారు. ఈవిడ ఆయనతో తను యాభై ఏళ్ళకి పైగా గడిపిన వైవాహిక జీవితాన్ని ‘శ్రీ కళ్యాణీయం‘ అనే పుస్తకంగా రాసారు. అది విశాలాంధ్రలో దొరుకుతుంది.

భారతిగారి తల్లి ఉషగారు. అమ్మకి బోలెడు వంటలు నేర్పారు.

రోహిణి, అస్సలు గర్వం లేకుండా సరదాగా, యమా ప్రొఫెషనల్‌గా ఉంటూ, మాకు సలహాలిస్తూ, భవిష్యత్తులో గొప్ప డైరెక్టర్ అయ్యే సూచనలున్న అమ్మాయి.

రేచల్. ఇంగ్లాండు నుండి వచ్చి ముంబైలో ఉంటూ నటనని వృత్తిగా తీసుకున్న ఈ అమ్మాయి, అక్కడ మురికివాడల్లో ఉన్న పిల్లల్ని చదివిస్తోంది. తను సంపాదించిన దాంట్లోనే వాళ్ళని పోషిస్తోంది.

కనిపించగానే కౌగలించుకుని, ముద్దులు పెట్టే ఈ అమ్మాయికి కళ్ళల్లోనే కాదు మనసు నిండా కూడా కరుణే.

కెమేరామెన్ దర్శన్‌గారు, ప్రొడ్యూసర్ కృష్ణగారి తమ్ముడు. మా అందర్నీ అందంగా చూపించడానికి ప్రయత్నించారు. ఆపైన చూసిన మీరే చెప్పాలి. వీళ్ళు ఎనిమిది మంది అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళూ.

పూర్ణప్రజ్ఞగారు సింగీతంగారి తమ్ముడి కొడుకు. కో డైరెక్టర్‌గా ఆయన అనుభవం అపారం. మంచి వ్యక్తి. సింగీతంగారితో పాటుగా నలభై ఐదు సంవత్సరాలుగా ఒకే ఇంట్లో భార్యా పిల్లలతో ఉంటున్నారు. ఆయన అన్న ఒక్క మాట నాదృష్టిలో ఆయన్ని చాలా గొప్పవాడ్ని చేసింది.

"నాకూ నా భార్యకీ అర్థంకాని మాట ఒకటే అమ్మా. మిస్ అండర్ స్టాండింగ్.. అదేమిటో నాకు ఇప్పటిదాకా జీవితంలో తెలియలేదు" అన్నారు.

ఇంకా ఈ సినిమాలో జెమినీ టి.వీ, జీ తెలుగులో సీ.ఈ.ఓ గా పని చేసిన సంజయ్ రెడ్డిగారు, హిప్నాటిస్ట్ నాగేష్ గారూ లాంటి మాకు తెలిసిన వాళ్ళు కూడా ఏక్ట్ చేసారు. ఇందులో సంజయ్, నిరంజని, రేచల్, ఊర్మిళా, ఈస్ట్‌బెన్, నేనూ, భువనచంద్రా, అనంత శ్రీరాం కలిసి నటించాం.

భారతిగారు కృష్ణగారి మిసెస్. ఈవిడ ప్రొడక్షన్ మొత్తం చూస్తారు. చెన్నైలో రెండూ, ఇక్కడ ఒకటీ గేమ్ షోస్ టీ.వీ.లో నిర్వహిస్తూ, కూడా సినిమా ప్లాన్ చేసి పక్కాగా పూర్తిచేసిన ఘనత ఈవిడది.

క్రియేటివిటీ తప్ప ప్రొడక్షన్‌లో వేలు పెట్టని ఆవిడ భర్త భారతీకృష్ణగారు నేను చూసిన మంచి వ్యక్తుల్లో ఒకరు. "మీరు మా ఇంట్లో మంచం మీద పడుకోవడం, భోజనం చెయ్యడం, కబుర్లు చెప్పడం చూస్తుంటే నాకు పండక్కి వచ్చిన పెద్దక్కని చూస్తున్నట్లు ఉంది" అంటూ నా తమ్ముళ్ళ జాబితాలో చేరిపోయారు.

ఈయన ఇంకో తమ్ముడు బాలూ ఈ.వీ.వీ సత్యనారాయణగారి దగ్గర పనిచేసేటప్పుడూ నాకు బాగా పరిచయం. వీళ్ళది కూడా కోరుమావిడే మొత్తం షూటింగ్‌లో ఎక్కువ శాతం వీళ్ళ ఊరు కోరుమావిడిలోనే జరిగింది.

చతుర్ కో డైరెక్టర్‌గా పని చేసాడు. మంచి అబ్బాయి ఆన్‌లైన్ ఎడిటింగ్ కూడా ఏ సీన్ కా సీన్ పూర్తిచేసేసారు.



బతుకు జట్కాబండీ, లక్కూ కిక్కూ మొదలైన గేమ్ షోస్ భారతీ కృష్ణగారివే. పూర్తి కో ఆర్డినేషన్, అండర్ స్టాండింగ్ భార్యాభర్తల మధ్య. అందుకే పని సజావుగా ముందుకి దూసుకుపోతుంది. ఇప్పటి జంటలు ఎంతైనా నేర్చుకోవాలి వీళ్ళ జంటని చూసి. వీళ్ళకో అబ్బాయి ప్రణీత్. పన్నెండేళ్ళుంటాయి. డైరెక్టర్ అవుతానంటాడు.


ఈ సినిమాలో నేను ఏక్ట్ చేసినట్లు పేపర్లో వార్త వచ్చాక, నేను ప్రస్తుతం పని చేస్తున్న దర్శక నిర్మాతలూ, ఇంకో ఇద్దరు బయట వాళ్ళూ వాళ్ళ సినిమాలో ఏక్ట్ చెయ్యమని ఫోన్లు చేసారు. నేను ఒప్పుకోలేదు. నా ప్రొఫెషన్ మార్చుకునే ఉద్దేశం నాకెంత మాత్రం లేదు. జీవితంలో ఒక అనుభవంగా ఈ నటన మిగిలి ఉండనీ అనుకున్నాను. నిజానికి కమర్షియల్‌గా నేను ఏడాదంతా చేసి సంపాదించేది నాలుగైదు సినిమాల్లో, ఒకటి రెండు రోజులు ఏక్ట్ చేసినా వచ్చేస్తుంది. కానీ నేను డబ్బు కోసం ఏక్ట్ చెయ్యదలచుకోలేదు.

ఇవండీ నా మొదటిసారి నటనానుభవాలు. నా కౌముది పాఠకులతో పంచుకోనిది ఏదీ అసలు నాకు విశేషమైనది కానే కాదు. అందుకే ఇలా పంచేసుకున్నాను.

**ఇవీ వెల్‌కమ్ ఒబామా ముచ్చట్లు.**



Click here to share your comments on this story.


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి